
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం ⋅ 14 ⋅ ఆగస్టు ⋅ 2025



సోమశిలలో 41.95 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 41.954 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 23,088 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.1,03,160
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,309
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,588
నవర (8 గ్రాములు)	రూ.76,704

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
27.0 /25.9

జిల్లాలో అక్కడక్కడా గురువారం వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గాలిలో తేమ 84 శాతంగా బుధవారం నమోదైంది.

న్యూస్‌రీల్

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ నియామకం



అన్వర్‌బాషా

నెల్లూరు (లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది అన్వర్ బాషాను నెల్లూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమిస్తూ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జారీ చేసింది. ప్రభుత్వం తరఫున సివిల్ కేసులను వాదించనున్నారు. పదవిలో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.280 బుధవారం లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 379 బేళ్లను తీసుకురాగా, 200 బేళ్లను కొనుగోలు చేయగా, వివిధ కారణాలతో 179ను తిరస్కరించారు. కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.280.. కనిష్ట ధర రూ.140.. సరాసరిగా రూ.197.69 లభించిందని వేలం నిర్వహణాధికారి శివకుమార్ వివరించారు. 19 కంపెనీలు పాల్గొన్నాయన్నారు.

డీసీపల్లిలో 125 బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 125 బేళ్లను బుధవారం విక్రయించామని నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 263 బేళ్లు రాగా, వీటిలో 125ను విక్రయించగా, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించామని చెప్పారు. 14287.1 కిలోల పొగాకును విక్రయించగా, రూ.31,67,732.60 వ్యాపారం జరిగిందన్నారు. గరిష్ట ధర కిలో రూ.280.. కనిష్ట ధర రూ.140.. సగటు ధర రూ.221.72గా నమోదైందని వివరించారు. వేలానికి పది కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారని పేర్కొన్నారు.

మైనింగ్ అనుమతులపై ఆందోళన

వరికుంటపాడు: వరికుంటపాడు పంచాయతీలోని జంగంరెడ్డిపల్లి భాస్కరాపురం కొండ తిప్పను మైనింగ్ కోసం ప్రైవేట్ కంపెనీకి కట్టబెట్టడాన్ని రైతు కూలీ, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య నేతలు ఖండించారు. వరికుంటపాడు, జంగంరెడ్డిపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణను బుధవారం నిర్వహించారు. తిప్పను మైనింగ్‌కు ఇస్తే నివాస ప్రాంతం ప్రమాదంలో పడుతుందని.. మేకలు, పశువులు తిరగలేకపోతాయని.. పేలుళ్లకు ఇళ్లు దెబ్బతినడంతో పాటు పంటలు నాశనమవుతాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్టీయూ నేత లక్ష్మీరెడ్డి మాట్లాడారు. అభివృద్ధి పేరుతో గ్రామాలను నాశనం చేయడాన్ని మానుకోవాలని, మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతు కూలీ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

- రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ చైర్మన్ ప్రసాద్‌ను వరికుంటపాడు పంచాయతీ మేధావుల ఫోరం ప్రతినిధులు విజయవాడలో కలిసి అర్జీని అందజేశారు. అనుమతులను తక్షణమే నిలిపేయాలని కోరారు.

రైతులకు విరివిగా రుణాల మంజూరు



మాట్లాడుతున్న మణిశేఖర్

ఉదయగిరి: ఉదయగిరిలోని వివిధ బ్యాంకులు రైతులకు విరివిగా రుణాలను మంజూరు చేయాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ మణిశేఖర్ పేర్కొన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో బ్యాంకర్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకర్లు వారికి కేటాయించిన లక్ష్యాలను నిర్దేశించిన గడువులోపు నూరు శాతం సాధించాలని సూచించారు. డెయిరీ ఫామ్‌ను ప్రోత్సహించేందుకు ఎక్కువ సంఖ్యలో రుణాలివ్వాలన్నారు. రికవరీ శాతాన్ని పెంచాలని పేర్కొన్నారు. జన సురక్ష పథకంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. బ్యాంకర్లు ఇతర శాఖల అధికారులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఖాతాదారుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని కోరారు. మెరుగైన సేవలందించాలని సూచించారు. ఖాతాదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిపుష్టి సాధించేలా అధికారులు చూడాలని కోరారు. సమావేశంలో అధికారులు కాశయ్య, రవిశంకర్ జయదేవ్, ఎంపీడీఓలు అప్పాజీ, గోపి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్టుగా వెన్నుపోటు

మోత మోగుతున్న విద్యుత్ బిల్లులు



‘విద్యుత్ స్మార్ట్ మీటర్లకు తాము వ్యతిరేకం.. వీటిని ఏర్పాటు చేస్తే పగలగొట్టండి’ అంటూ గతంలో టీడీపీ నేతలు సృష్టించిన హడావుడి అంతా ఇంతా కాదు. తాము అధికారంలోకి వస్తే ఈ ప్రక్రియను ఉపసంహరిస్తామంటూ ఎన్నికల సమయంలో హామీలనూ గుప్పించారు. తీరా కొలువుదీరాక, వీటిని బిగించే ప్రక్రియను ముమ్మరం చేయడం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థలకు వీటిని ఏర్పాటు చేశారు. ఆపై గృహాల్లోనూ బిగించేందుకు ఉపక్రమించడంపై ప్రజలు మండిపడుతున్నారు.



- ఇప్పటికే పలు ప్రభుత్వ, వాణిజ్య సంస్థల్లో మీటర్ల ఏర్పాటు
- మాకొద్దు మహాప్రభో అంటున్నా పట్టించుకోని సర్కార్
- పూటపూటకూ మారనున్న టారిఫ్‌తో ప్రజల బెంబేలు
- రీచార్జి చేస్తేనే ఇంట్లో కరెంట్

డివిజన్లు	విద్యుత్ సర్వీసులు	స్మార్ట్ మీటర్లు
ఆత్మకూరు	1,39,498	9,449
కావలి	1,02,397	6,858
నెల్లూరు టౌన్	2,56,476	28,661
నెల్లూరు రూరల్	1,91,646	13,245
కోవూరు	1,28,177	15,504
మొత్తం	8,18,194	73,717



నెల్లూరు (వీఆర్సీసెంటర్): సీఎం చంద్రబాబు మార్కు మోసాల్లో తాజాగా మరొకటి చేరింది. స్మార్ట్ మీటర్లను బిగించబోమంటూ గతంలో కల్లబొల్లి కబుర్లు చెప్పిన ఆయన తాజాగా వీటి ఏర్పాటు దిశగా అడుగులేస్తున్నారు. ఈ పరిణామం ప్రజలను కలవరపాటుకు గురిచేస్తోంది. అసలీ స్మార్ట్ మీటర్ల గోల ఏమిటానని వారు ఆందోళనకు గురవుతున్నారు.

గుడ్లు తేలేస్తున్నారు..

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి స్మార్ట్ మీటర్ల ఏర్పాటు దిశగా అడుగులేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థల్లో వీటిని ఏర్పాటు చేశారు. తదనంతరం 200 యూనిట్లు వాడే ప్రతి గృహంలోనూ బిగించే దిశగా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో నెలకొల్పారు. పాత మీటర్ల స్థానంలో వీటిని ఏర్పాటు చేశాక, విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయి. దీనిపై వినియోగదారులతో పాటు వామపక్ష పార్టీల నేతలు వ్యతిరేకిస్తున్నారు. సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాలనూ చేపడుతున్నారు.

నాలుగింతలు అధికంగా..

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో విద్యుత్ సర్వీసులు 9,64,379 ఉండగా, ఇందులో వ్యవసాయ సర్వీసులు 1,46,185. ప్రస్తుతానికి వీటిని మాత్రం స్మార్ట్ మీటర్ల నుంచి మినహాయించారు. నగరంలోని ఓ పిండిమిల్లు యజమానికి గతంలో నెలకు రూ.ఆరు బిల్లొచ్చేది. అయితే స్మార్ట్ మీటర్‌ను ఏర్పాటు చేశాక, ఏకంగా రూ.26 వేలొచ్చింది. మరో దుకాణ యజమానికి నెలకు రూ.మూడు వేల బిల్లు వస్తుండగా, ఆపై ఇది రూ.ఐదు వేలకు పెరిగింది.

టారిఫ్ తంటాలు

ఈ విధానంతో టారిఫ్ సైతం మారనుంది. గతంలో పాత మీటర్లు ఉన్న సమయంలో రోజంతా ఒకే టారిఫ్‌తో నెల బిల్లొచ్చేది. అయితే వినియోగించే యూనిట్లు అధికమయ్యే కొద్దీ ఇది మారుతూ ఉండేది. 0 – 30 యూనిట్ల వరకు ఒక టారిఫ్.. 31 – 75.. 76 – 125.. 126 – 225.. 226 – 400.. 400 –500 యూనిట్ల వరకు ఉండేది. అయితే స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఒకలా.. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మరోలా.. సాయంత్రం నుంచి తెల్లవారు వరకు మరో టారిఫ్‌లో బిల్లులొచ్చే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ మీటర్ ధర రూ.20 వేలకుపైగా ఉంటుంది. ఏర్పాటు సమయంలో ప్రజల నుంచి ఎలాంటి నగదును కట్టించుకోకుండా, మీటర్ ధర మొత్తాన్ని బిల్లులో కలుపుతారేమోననే అనుమానం తలెత్తుతోంది.

ఇక అంతా ప్రీపెయిడే..

వాస్తవానికి గతంలో నెలంతా వాడుకున్న యూనిట్లకు లెక్క కట్టి రీడింగ్ తీసి బిల్లులిచ్చేవారు. దీన్ని 15 రోజుల్లో చెల్లించే వెసులుబాటు ఉండేది. అయితే ఇక నుంచి ఈ అవకాశం ఉండదు. మొబైల్ ఫోన్లలో ప్రీపెయిడ్ తరహాలో ఇక ముందే రీచార్జి చేసుకోవాలి. ఒకవేళ ఇది పూర్తయితే విద్యుత్ సరఫరా నిలిచిపోయే ప్రమాదమూ ఉంది. ఇది సామాన్యులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడమేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



వరికుంటపాడు మండలం వేంపాడుకు చెందిన ఈ రైతు నూతలపాటి రామయ్య 20 ఏళ్ల నుంచి బత్తాయిని సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రెండెకరాల్లో సాగుంది. ఎకరాలో పెట్టుబడికి కనీసం రూ.50 వేల వరకు ఖర్చవుతోంది. ప్రస్తుతం ఉన్న దిగుబడి, ధరలను చూస్తే నష్టాలొచ్చే పరిస్థితి ఉండటంతో ఏమి చేయాలో పాలుపోవడంలేదని పేర్కొంటున్నారు.



బత్తాయి.. బేల చూపులు

భారీగా పతనమవుతున్న ధరలతో బత్తాయి రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. వాస్తవానికి సిట్రస్ జాతికి చెందిన బత్తాయి కాయల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉండటంతో ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఎక్కువ మంది ఈ జ్యూస్ తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. వినియోగం పెరగడంతో జిల్లాలో బత్తాయి సాగు చేసే రైతుల సంఖ్యా ఎక్కువైంది. మార్కెట్లో నాలుగేళ్లుగా మంచి డిమాండ్ ఉండటంతో రైతుల ముఖాల్లో వెలుగులు కనిపించాయి. అయితే ప్రస్తుతం పతనమైన ధరలతో వారు బేల చూపులు చూడాల్సి వస్తోంది.

ప్రభుత్వం ఆదుకోవాలి



బత్తాయి సాగు చేసిన రైతులకు ఈ ఏడాది నష్టం తప్పేలా లేదు. ధరలు భారీగా పతనమయ్యాయి. నాలుగేళ్ల నుంచి ధరలు బాగా ఉండటంతో లాభాలొచ్చాయి. అయితే ఈ ఏడాది పరిస్థితి పూర్తి భిన్నంగా మారింది. ప్రభుత్వం ఆదుకోకపోతే ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉంది.

– గౌస్‌మొయిద్దీన్, దాసరిపల్లి, రైతు

- భారీగా పతనమవుతున్న ధరలు
- నష్టాల ఊబిలో కూరుకుపోతున్న రైతులు
- మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలని అభ్యర్థన

జిల్లాలో సాగు	దిగుబడి అంచనా
16 వేల హెక్టార్లు	41 వేల మెట్రిక్ టన్నులు

ఉదయగిరి: బత్తాయి ధర నేల చూపు చూస్తోంది. వాతావరణ పరిస్థితులు బాగా ఉండటంతో దిగుబడి ఆశాజనకంగా ఉన్నా, ధర మాత్రం దిగజారుతోంది. జిల్లాలో 16 వేల హెక్టార్లలో బత్తాయి సాగవుతోంది. మెట్ట మండలాలైన వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి, కలిగిరి, వింజమూరు, ఆత్మకూరు, మర్రిపాడు, ఏఎస్‌పేట, కొండాపురం, సర్వేపల్లి తదితర మండలాల్లో తోటలు సాగులో ఉన్నాయి.

ఎంతో వ్యత్యాసం

గతేడాది ఇదే సమయంలో టన్ను ధర రూ.40 వేలు వరకు ఉండగా, ప్రస్తుతం రూ.15 వేలు మాత్రమే ఉంది. ఈ వేసవి సీజన్లోనూ మంచి ధరలు లభించాయి. అయితే ఇటీవలి కాలంలో ఎన్నడూ లేని విధంగా ధరలు పతనమవడంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు.

ధరలు తగ్గించి..

జిల్లాలో సాగు చేసే బత్తాయికి ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉంటుంది. అయితే ప్రస్తుత సీజన్లో తెలంగాణ, మహారాష్ట్ర నుంచి బత్తాయి దిగుబడి అధకంగా ఉండటంతో ధరలను వ్యాపారులు తగ్గించారు. దసరా నాటికి ధరలు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెప్తున్నా, అప్పటి వరకు కాయలను ఉంచుకునే పరిస్థితి లేదు. ఈ తరుణంలో కనీస మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించి కొనుగోలు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

సెమీ కండక్టర్ పరిశ్రమలో పెట్టుబడులు



మాట్లాడుతున్న మాధవ్

నెల్లూరు రూరల్: భారత్‌లో సెమీ కండక్టర్ పరిశ్రమలో పెట్టుబడులను జపాన్ తదితర దేశాలు పెడుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. తిరుపతిలోని టెక్నాలజీ పార్కులో రూ.400 కోట్లతో పరిశ్రమను స్థాపించనున్నారని తెలిపారు. కార్యకర్తలను కలిసి చాయ్ పే కార్యక్రమంలో అందర్నీ సమన్వయం చేయాలనే ఉద్దేశంతో యాత్రను చేపడుతున్నామని పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, రవిచంద్రరెడ్డి, కందికట్ల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

యూరియా కల్తీపై తనిఖీలు



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు(అర్బన్): వ్యవసాయ పంటలకే పరిమితం కాకుండా వివిధ రంగాల ఉత్పత్తుల్లో కల్తీ చేస్తున్న యూరియాను కనుగొనేందుకు పెద్ద ఎత్తున తనిఖీలను నిర్వహించాలని జేసీ కార్తీక్ ఆదేశించారు. కలెక్టరేట్లోని తన చాంబర్‌లో అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో యూరియాను ప్లయ్ ఉడ్, పెయింట్ పరిశ్రమలు, పశువుల దాణా తదితరాల్లో అక్రమంగా వినియోగిస్తున్నారనే వార్తలొస్తున్న తరుణంలో, తనిఖీలు చేయాలని సూచించారు. యూరియా పక్కదారి పట్టడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈ క్రమంలో వ్యవసాయ, విజిలెన్స్, ఇండస్ట్రీస్, రవాణా, పొల్యూషన్ బోర్డు, ఎక్సైజ్ శాఖల నుంచి ప్రతినిధులను తీసుకొని ఒక టీమ్‌ను ఏర్పాటు చేయనున్నామన్నారు. యూరియాను వ్యవసాయం కాకుండా ఇతర ఉత్పత్తుల్లో వినియోగించారని తేలితే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

ప్లాస్టిక్ భూతం అంతమెప్పటికో..?



ప్లాస్టిక్ కవర్లలో కూరగాయలను తీసుకెళ్తూ..



మార్కెట్లో ఇలా..

- తగ్గుముఖం పట్టిన తనిఖీలు
- పుంజుకుంటున్న వినియోగం
- పర్యావరణ పరిరక్షణ ప్రశ్నార్థకం..?

నెల్లూరు(బారకాసు): నగరంలో ప్లాస్టిక్ వినియోగం నానాటికీ తీవ్రమవుతోంది. దీన్ని ఉపయోగిస్తే ప్రమాదం సంభవిస్తుందనే అంశంపై విస్తృతంగా ప్రచారం చేసిన నగరపాలక సంస్థ తదనంతరం మిన్నకుండిపోయింది. మొదట్లో ప్లాస్టిక్ విక్రేతలు తదితరులపై దాడులు జరిపి జరిమానాలు విధించిన సందర్భాలూ ఉన్నాయి. దీంతో కొన్నాళ్ల పాటు తగ్గిన ఈ ప్రక్రియ తిరిగి యథాస్థితికి చేరుకుంది.

నగరంలో ఇలా..

నగరంలోని స్టోన్‌హౌస్‌పేట, రేబాలవారివీధి, చిన్నబజార్, పెద్దబజార్, పణతులవారివీధి తదితర ప్రాంతాల్లో హోల్‌సేల్ ప్లాస్టిక్ దుకాణాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఇక్కడి నుంచి భారీగా వ్యాపారం జరుగుతోంది. తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు, పూల దుకాణాలు, కూరగాయల మార్కెట్ తదితరులు నిషేధిత ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. వస్త్ర సంచులను వినియోగించాలని ఎంతో మంది ప్రచారం చేస్తున్నా, ఎలాంటి ప్రయోజనం కానరావడంలేదు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా దీనిపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చర్యలు చేపడతాం



ప్లాస్టిక్ నియంత్రణకు త్వరలోనే చర్యలు చేపడతాం. నిషేధిత ప్లాస్టిక్‌ను ఎవరూ వినియోగించరాదు. డ్రైవ్‌లను తరచూ చేపట్టి ప్రజల్లో మరింత అవగాహన కల్పిస్తాం. వీటికి దూరంగా ఉండాలి.

– కనకాద్రి, ఎంహెచ్ఓ, నగరపాలక సంస్థ

ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు నోటిఫికేషన్

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో 2025 – 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాల్లో మిగిలిన సీట్ల కోసం అదనపు నోటిఫికేషన్‌ను జారీ చేశామని డీఈఓ బాలాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటి కోసం ఈ నెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 21న విద్యార్థుల అర్హత నిర్ధారణ, 25న లాటరీ ఫలితాల ప్రకటన, 31న పాఠశాలల్లో అడ్మిషన్లను ఖరారు చేయనున్నామని వెల్లడించారు. వివరాలకు bseap.org.inను సంప్రదించాలని సూచించారు.

పొలమనుకుంటే పొరపాటే..!

ఈ చిత్రాన్ని చూసి ఇదేదో పొలం అనుకుంటే పొరపాటే. అధికారుల అలసత్వం పుణ్యమానని నెల్లూరు బ్యారేజీ సమీపంలోని పెన్నాలో గుర్రపు డెక్క పేరుకుపోయింది. దీన్ని ఎప్పటికప్పుడు తొలగించి పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దే అవకాశమున్నా, ఆ దిశగా ఎవరూ చర్యలు చేపట్టడంలేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



ప్రయాణికుడి ముసుగులో నేరాలు


మాట్లాడుతున్న డీఎస్పీ మురళీధర్, చిత్రంలో రికవరీ చేసిన సొత్తు

- అంతర్రాష్ట్ర నేరగాడి అరెస్ట్
- రూ.12 లక్షల సొత్తు స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): ప్రయాణికుడి ముసుగులో రైళ్లలో నేరాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నేరగాడిని నెల్లూరు రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం నెల్లూరు రైల్వే డీఎస్పీ జి.మురళీధర్ స్థానిక కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. నెల్లూరు రైల్వే సీఐ ఎ.సుధాకర్ తన సిబ్బంది, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు పి.రమేష్‌గౌడ్, హజరిలాల్ గుర్జార్‌తో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. రైళ్లు, రైల్వేస్టేషన్లలో నేరాల నియంత్రణ, మత్తు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడిలో భాగంగా నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఆ బృందాలు నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టాయి. జనశతాబ్ది రైలు దిగి అనుమానాస్పదంగా ఉన్న తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ చాంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందిన కె.గోవర్ధన్ అలియాస్ కార్తీక్ అర్వింద్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. కావలి, నెల్లూరు, గూడూరు ప్రాంతాల్లో రైళ్లలో చోరీలకు పాల్పడినట్లు వెల్లడించాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి రూ.12 లక్షల విలువైన 143 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

చిన్నతనం నుంచే..

నిందితుడు చిన్నతనం నుంచే వ్యసనాలకు బానిసై సులభ మార్గంలో నగదు సంపాదించేందుకు రైళ్లలో ప్రయాణికుని ముసుగులో చోరీలకు పాల్పడసాగాడు. జనరల్ టికెట్ తీసుకుని దివ్యాంగులు, జనరల్ బోగీల్లో ఎక్కేవాడు. అదును చూసి ఏసీ బోగిల్లోకి వెళ్లి నిద్రిస్తున్న ప్రయాణికుల నగల బ్యాగ్‌లు, ల్యాప్‌టాప్‌లను చోరీ చేసేవాడు. అతనిపై హైదరాబాద్‌తోపాటు నంద్యాల, కర్నూలు, విజయవాడ, తిరుపతిల్లో కేసులున్నాయి. నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన సీఐ, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు, నెల్లూరు, గూడూరు రైల్వే ఎస్సైలు హరిచందన, చెన్నకేశవ, సిబ్బంది దయాకర్, మణికంత, కిరణ్ తదితరులను డీఎస్పీ అభినందించారు.

ఏంటిది అధ్యక్షా..


ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు మాధవ్ బుధవారం నెల్లూరుకు విచ్చేశారు. ఆ పార్టీ సమావేశం కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగింది. ఈ సందర్భంగా వీఆర్సీ నుంచి కస్తూర్బా వరకు ర్యాలీ నిర్వహించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. నేతలు, కార్యకర్తల అత్యుత్సాహం వల్ల ఓ ప్రైవేట్ అంబులెన్స్ చిక్కుకుపోయింది. అలాగే వీఆర్సీ వద్ద నడిరోడ్డుపై బాణసంచా కాల్చడంతో అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



వీఆర్సీ వద్ద బాణసంచా కాల్చిన శ్రేణులు

క్లుప్తంగా

తల్లి, కుమారుడి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): తల్లి, కుమారుడు అదృశ్యం ఘటనపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. భక్తవత్సలనగర్‌లో ప్రకాష్ కుటుంబం నివాసం ఉంటోంది. అతడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఈనెల నాలుగో తేదీన భార్య, చిన్నకుమారుడు ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. బాధిత కుటుంబ సభ్యులు వారి కోసం గాలించారు. జాడ తెలియరాకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

స్వగ్రామానికి వెళ్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ఘటనా స్థలంలో మృతదేహం

ఆత్మకూరు: మండలంలోని వాశిలి గ్రామం వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆత్మకూరు ఎస్సై ఎస్‌కే జిలానీ, స్థానికుల కథనం మేరకు.. వాశిలి గ్రామానికి చెందిన షేక్ అన్వర్ (59) అనే వ్యక్తి నవరంగ మేళం బృందంలో సభ్యుడిగా ఉన్నాడు. బుధవారం ఉదయం ఆత్మకూరుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి టీవీఎస్ మోపెడ్‌పై వస్తున్నాడు. గ్రామంలోకి వెళ్లేందుకు రోడ్డు క్రాస్ చేస్తుండగా నెల్లూరు నుంచి బద్వేల్ వైపు వేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో వాహనాలు రోడ్డు పక్కన గుంతలో పడిపోయాయి. అన్వర్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై జిలానీ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇంటి పెద్ద అన్వర్ మృతి చెందడంతో ఆ కుటుంబీకులు తీవ్రంగా రోదిస్తున్నారు. ప్రభుత్వంఆదుకోవాలని కోరారు.

చోరీ సొత్తు రికవరీ

ఉదయగిరి: ఉదయగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చోరీకి పాల్పడిన బాల నేరస్తుడిని అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. జూన్ 10వ తేదీ రాత్రి ఏఎంసీ కార్యాలయ కిటికీలు ధ్వంసం చేసి లోనికి ప్రవేశించి కంప్యూటర్లు, ఇతర సామగ్రి చోరీ చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పట్టణంలోని షబ్బీర్ కాలనీకి చెందిన ఓ బాలుడు చోరీ చేసినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడిని జువనైల్ కోర్టులో హాజరుపరిచామని ఎస్సై తెలిపారు.

492 బస్సుల కేటాయింపు

నెల్లూరు సిటీ: మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించి జిల్లాలో 492 బస్సులను కేటాయించినట్లు ఆర్టీసీ ప్రజా రవాణా శాఖ అధికారి షేక్ షమీమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు డిపో పరిధిలో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కలిపి 61, కందుకూరులో 60, కావలిలో 90, నెల్లూరు డిపో–1లో 91, డిపో–2లో 90, రాపూరులో 49, ఉదయగిరిలో 51 బస్సులను సిద్ధం చేశామన్నారు. శుక్రవారం నెల్లూరులోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో మంత్రి నారాయణ ఈ పథకాన్ని ప్రారంభిస్తారన్నారు.

త్వరలో విజయవాడలో యానాది గర్జన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఎస్టీ వర్గీకరణ కోసం త్వరలో విజయవాడలో యానాది గర్జన నిర్వహిస్తామని యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్రాధ్యక్షుడు కేసీ పెంచలయ్య తెలిపారు. నెల్లూరులోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో బుధవారం రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన నాయకులతో సమావేశం నిర్వహించి తీర్మానాలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్టీ వర్గీకరణపై, యానాదుల ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసే వరకూ రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు బాపట్ల బ్రహ్మయ్య, తలపల చెంచు మల్లికార్జునరావు, బాకుల మురళి, తిరువెళ్ల శీను, నీలం సురేంద్ర, మానికల మురళి తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు ధాన్యం కొనాలి

- జేసీ కార్తీక్‌ను కోరిన రైతు సంఘాల నాయకులు


మాట్లాడుతున్న జేసీ కార్తీక్


పాల్గొన్న నాయకులు, అధికారులు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఎడగారు వరి పంటకు సంబంధించి ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతు సంఘాల నాయకులు జేసీ కార్తీక్‌ను కోరారు. బుధవారం జేసీ అన్ని పార్టీల రైతు సంఘాల నాయకులు, మిల్లర్ల అసోసియేషన్ నాయకులు, అధికారులతో నెల్లూరు కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సీజన్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతి రాలేదని, రైతు నష్టపోకుండా ఉండాలంటే ఎలాంటి చర్యలు చేపట్టాలో తెలపాలని ఆయన కోరారు. దీంతో రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం కూడా ప్రభుత్వం తూతూమంత్రంగా చర్యలు చేపట్టిందన్నారు. కేవలం లక్ష టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసి చేతులు దులుపుకొందన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రస్తుతం జిల్లాలో పండిస్తున్న కేఎన్ఎం 733, ఎంటీయూ 1010 లాంటి రకాలన్ని కూడా ఏ–గ్రేడ్‌కు చెందినవేనన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పుట్టి రూ.19,770కు మిల్లర్లు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు కురుస్తున్నాయని, ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు కూడా సమయం లేదని వివరించారు. ఈ సాకుతో మిల్లర్లు మద్దతు ధర తగ్గించకుండా ఉండేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. సాగు ఖర్చు ఈ ఏడాది 20 శాతం అదనంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం మాత్రం 3 శాతమే మద్దతు ధర పెంచిందన్నారు. ఈ స్థితిలో రైతులు నష్టపోతున్నారన్నారు. ఇంకా నష్టపోకుండా ఉండాలంటే ప్రస్తుత మద్దతు ధరకు మిల్లర్లు కొనుగోలు చేయాల్సిందేనని తెలిపారు. ఇదే విషయాన్ని ఏకగ్రీవంగా ఇతర నాయకులు కూడా తెలిపారు. దీంతో జేసీ స్పందిస్తూ మిల్లర్లకు తగిన ఆదేశాలు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు చంద్ర రాజగోపాల్, మూలె వెంగయ్య, శ్రీనివాసులు, రమణయ్య, వ్యవసాయ శాఖ జేడీ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.


హాస్పిటళ్లలో ఆకస్మిక తనిఖీలు


రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ఉమామహేశ్వరి

నెల్లూరు(అర్బన్): డీఎంహెచ్ఓ సుజాత ఆదేశాల మేరకు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి (డీఐఓ) ఉమామహేశ్వరి బుధవారం హాస్పిటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నెల్లూరులోని విజయానంద్ ఆర్థోపెడిక్ ఆస్పత్రి, సుమ స్కిన్ అండ్ లేజర్ క్లినిక్, లక్ష్మి ఆర్థోకేర్ సెంటర్, ఆకర్ష్ హాస్పిటల్ తదితరాలకు వెళ్లారు. ఏపీ అల్లోపతి క్లినికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2002 నిబంధనల ప్రకారం ఆస్పత్రి నిర్వహణ జరుగుతుందో? లేదా? పరిశీలించారు. రికార్డులు చూశారు. ఉమామహేశ్వరి మాట్లాడుతూ ఆస్పత్రుల్లో ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. స్కానింగ్ వివరాల నివేదికను ప్రతి నెలా వైద్యశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్లు లేకుండా ఎవరైనా వైద్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.40
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	: రూ.120
లేయర్	: రూ.118
బ్రాయిలర్ చికెన్	: రూ.220
స్కిన్‌లెస్ చికెన్	: రూ.244
లేయర్ చికెన్	: రూ.200

చీకటి జీఓలు రద్దు చేయాలంటూ..


జీఓ పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

నెల్లూరు(టౌన్): ప్రభుత్వ విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాల నాయకులు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన చీకటి జీఓలను రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్ డిమాండ్ చేశారు. బుధవారం వీఆర్సీ సెంటర్‌లో జీఓలను రద్దు చేయాలంటూ పత్రాలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ఏడాదిగా విద్యార్థి సంఘాల నాయకులు ఉద్యమాలు చేస్తున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జీఓను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు షారూఖ్, ఆశిర్, ఖాదర్ మస్తాన్, నవీన్, చరణ్, వంశీ పాల్గొన్నారు.

మహాసభల జయప్రదానికి పిలుపు


పోస్టర్లను ప్రదర్శిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు నగరంలో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు జరిగే సీపీఐ జిల్లా మహాసభలు, 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో నిర్వహించే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య పిలుపునిచ్చారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. కోటమిట్ట షాదీమంజిల్‌లో జిల్లా సభలు జరుగుతాయన్నారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సిరాజ్, మధు, షానవాజ్, మహిళా సంఘం నాయకురాలు శిరీషా, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి కాలువలో మృతదేహం



నెల్లూరు(క్రైమ్): నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ (పీఎస్ఆర్ బస్టాండ్) సమీప సర్వేపల్లి కాలువలో బుధవారం గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని కాలువలో నుంచి బయటకు తీశారు. మృతుడి వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్లలోపు ఉండొచ్చని భావిస్తున్నారు. ఎరుపు రంగు హాఫ్‌హ్యాండ్స్ టీషర్ట్, బ్లాక్ లోయర్ ధరించి ఉన్నాడు. మృతదేహం ఉబ్బి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో చనిపోయి రెండు రోజులై ఉండొచ్చని తెలుస్తోంది. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడు ప్రమాదవశాత్తు నీటిలో పడ్డాడా?, ఆత్మహత్య చేసుకున్నాడా?, ఇతర కారణం ఉందా? అనేది పోస్టుమార్టంలో తెలియాల్సి ఉంది. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 96306 ఫోన్ నంబర్‌కు తెలియజేయాలని నవాబుపేట ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

డివైడర్‌ను ఢీకొట్టి కారు బోల్తా


ఘటనా స్థలంలో కారు

నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని ధనలక్ష్మీపురం వద్ద డివైడర్‌ను ఢీకొట్టి కారు బోల్తా పడి ఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కారు ముత్తుకూరు వైపు వేగంగా వెళ్తోంది. డ్రైవర్ దానిని అదుపు చేయలేకపోవడంతో డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. వాహనంలోని నలుగురు వ్యక్తులకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. కారు బోల్తా పడిన సమయంలో ఎదురు నుంచి వాహనాలు రాకపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

స్వాతంత్ర్య దినోత్సవ వెలుగులు



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు నెల్లూరులోని కలెక్టరేట్ ముస్తాబైంది. భవనాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. – నెల్లూరు(అర్బన్)

చుండి మోడల్ స్కూల్ ఎంపిక

వలేటివారిపాలెం: ఉత్తమ పాఠశాలగా మండలంలోని చుండి మోడల్ స్కూల్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పడమటి వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పది పాఠశాలలను ఎంపిక చేయగా అందులో చుండి స్కూల్ ఉందన్నారు. యాజమాన్యాల వారీగా పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత, అత్యధిక సరాసరి మార్కులు సాధించిన స్కూళ్లను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈనెల 15వ తేదీన విజయవాడలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం అవార్డు ప్రదానం చేస్తారన్నారు.

కండలేరులో 26.8 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 26.8 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 5,900 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,800, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, మొదటి బ్రాంచ్ కాలువకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

చిరుజల్లులు కురిసిన వేళ..

నెల్లూరు నగరంలో బుధవారం చిరుజల్లులు కురిశాయి. ఆకాశం మేఘావృతమై వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


నగరంలో వాతావరణం ఇలా..




గొడుగు నీడలో వెళ్తూ..